నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 19 ఫిబ్రవరి 2024 | ADILABAD

## ఘనంగా బోనాల పండుగ



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, ఫిబ్రవరి 18 : నేతాజీ నగర్‌లో ఆదివారం బోనాల పండుగను నిర్వహించగా ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఫంక్షన్ హాల్‌కు నిధులు వెచ్చించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాసేవకు అంకితం అవుతానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామారావు పటేల్ బోనమెత్తుకున్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి అల్లోల

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : కేసీఆర్ సర్కారు హయాంలోనే రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఆలయాలను నిర్మించుకున్నామని దేవాదాయశాఖ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గొల్లపేట్ కాలనీలో ప్రసన్నాంజనేయస్వామి, శివ పంచాయతన దేవత పునః ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఈశ్వర్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, స్థానిక కౌన్సిలర్ కొండా సబిత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సీవోఈ పరీక్ష ప్రశాంతం

- హాజరైన 2,057 మంది.. 95.85 శాతం నమోదు
- గిరిజన గురుకులం ఆర్సీవో దిలీప్‌కుమార్



ఉట్నూర్‌లోని గిరిజన గురుకులం కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్సీవో దిలీప్‌కుమార్

ఎదులాపురం, ఫిబ్రవరి 18 : తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ(టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఒక నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు ఒక గంట ముందుగానే చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2,146 మంది దరఖాస్తు చేసుకోగా.. 2,057 మంది హాజరయ్యారు. 89 మంది గైర్హాజరు కావడంతో 95.85 హాజరు శాతం నమోదైంది. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని గిరిజన గురుకులం ఆర్సీవో దీలిప్ కుమార్ తెలిపారు.

## వన్య ప్రాణుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

- పీసీసీఎఫ్ డోబ్రియల్




పునరావాస ఇండ్లను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ డోబ్రియల్, అటవీశాఖ ఉన్నతాధికారులు

కడెం, ఫిబ్రవరి 18 : కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో వన్యప్రాణులకు తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులకు పీసీసీఎఫ్ డోబ్రియల్ సూచించారు. ఆదివారం లక్ష్మీపూర్ అటవీ ప్రాంతంలో 50 మీటర్ల పొడవు గల క్యానోపి వాక్‌ను అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం లక్ష్మీపూర్ గ్రాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. అడవులు, వన్య ప్రాణుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో తునికాకు, ఇప్ప పువ్వు సేకరణ నిషేధం అని పేర్కొన్నారు. అటవీ ఆక్రమణకు పాల్పడినా, వన్య ప్రాణులను వేటాడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కొత్త మద్దిపడగలో నిర్మిస్తున్న పునరావాస ఇండ్లను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో రామ్ కిషన్ యాదవ్, ఎఫ్డీవో భవానీ శంకర్, ఎఫ్ఆర్వో అనిత, డీఆర్వో సిద్ధార్థ పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నిక

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 18 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కొత్త కమిటీ ఎన్నిక ఆదివారం జడ్పీ బాలుర పాఠశాలలో రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లా రెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ పరిశీలకులు రాజేశ్, ఎలక్షన్ అధికారి నిమ్మతి శ్రీనివాస్ సమక్షంలో నిర్వహించారు. చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ వేణుగోపాలాచారి, చైర్మన్‌గా పార్థసారథి, అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారాయణరెడ్డి, జనరల్ సెక్రటరీగా రఘునాథరెడ్డి, ట్రెజరర్‌గా రమేశ్, ఉపాధ్యక్షులుగా రాంచందర్, శ్రీధర్ రెడ్డి, సాంబమూర్తి, చంద్రమోహన్‌గౌడ్, శ్రీనివాస్, చంద్రయ్య, జాయిం ట్ సెక్రటరీలుగా సుధాకర్, ఫ్రాన్సిస్, రమేశ్, శేఖర్, పాండూ నాయక్, శ్రీనివాసరాజు, సభ్యులుగా శ్రీనివాస రెడ్డి, మార య్య, శరత్ బాబు, శ్రీనివాస్ గౌడ్, దేవేందర్, హరిచరణ్, భూమన్న, ఈశ్వరాచారి, మహేందర్ సింగ్ ఎన్నికయ్యారు.

# వైభవంగా బుడుందేవ్ జాతర

- శ్యాంపూర్‌లో మహానందికి పూజలు చేసిన మెస్రం వంశీయులు
- పది రోజులపాటు కొనసాగనున్న జాతర



బుడుందేవ్‌కు పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



బుడుందేవ్ విగ్రహం



శ్యాంపూర్ గ్రామంలోని ఆలయం

ఉట్నూర్, ఫిబ్రవరి 18 : ఆదిలాబాద్ జిల్లా అనగానే గుర్తొచ్చేది అమాయక గిరిజనులు. ఇక్కడ కొండలు, కోనలు, అడవులు దట్టంగానే ఉంటాయి. ఆదివాసులకు పుష్య మాసం పవిపత్రమైనది. ఈ మాసంలో దేవుడికి మొక్కులు తీర్చుకుంటూ జాతరలు నిర్వహిస్తారు. ఆధ్యాత్మికంగా, పవిత్రంగా దేవుళ్లను కొలుస్తారు. ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయాలు విభిన్నంగా.. గొప్పగా.. చూడ ముచ్చటగా ఉంటాయి. వారి పండగలు.. అటవీ సంరక్షణ.. అడవులతో ఉన్న బంధం విడదీయరానిది. రాష్ట్రంలోనే రెండో పెద్ద పండుగ కేస్లాపూర్ జాతర ముగియగానే మెస్రం వంశీయులు శ్యాంపూర్‌కు చేరుకున్నారు. రెండు రోజుల క్రితం బుడుందేవ్ (మహానంది)జాతరను ప్రారంభించారు. మెస్రం వంశీయుల పూజల అనంతరం దాదాపు 10 రోజుల వరకు జాతర కొనసాగనున్నది.

### బుడుందేవ్ చరిత్ర

పూర్వ కాలంలో గౌరపూర్ అనే గ్రామంలోని ఆవుల మందలో ఉన్న ఆంబోతు (ఎద్దు) పశువుల మంద నుంచి తప్పించుకుని శ్యాంపూర్ ప్రాంతంలో చేలను నాశనం చేస్తున్నది. దీంతో ఆగ్రహించిన కోత్వాళ్లు వారి వద్ద ఉన్న ఆయుధంతో సంహరించారని పూర్వీకులు పేర్కొంటారు. మృతిచెందిన ఆంబోతును దూర ప్రాంతంలో పారవేయడానికి వెళ్తుండగా.. బండరాయిగా మారి బుడుందేవ్‌గా అవతరించిందని వంశ పెద్దలు చెబుతున్నారు. నాగోబా జాతర ముగిసిన మరుసటి రోజు నుంచే శ్యాంపూర్‌లో బుడుందేవ్‌ను మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలతో కొలవడంతో జాతర ప్రారంభమవుతుంది. సుమారు 10 రోజులు జాతర కొనసాగనున్నది.

### భారీగా రానున్న భక్తులు

సాలేవాడ(కే) శివాలయంలో జాతర ముగియడంతో శ్యాంపూర్‌లోని బుడుందేవ్ రెండో జాతర ప్రారంభంకానున్నది. ఇందులో బుడుందేవ్ జాతరకు భారీగా భక్తులు రానున్నారు. ఈ జాతరకు డివిజన్ నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఇప్పటికే మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. నాగోబా జాతరలోని రంగుల రట్నాలు శ్యాంపూర్‌కు రానున్నాయి.

### ఘనంగా నిర్వహిస్తాం..



యేటా బుడుందేవ్ జాతర నిర్వహిస్తాం. ఇది మండలంలోనే పెద్ద జాతర. కేస్లాపూర్ జాతర ముగించుకుని మెస్రం వంశీయులు బుడుందేవ్‌కు పూజలు నిర్వహించారు. అనంతరం ఇక్కడ జాతర 10 నుంచి 15 రోజులపాటు జరుగనుంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పుణ్యమాసం ఆదివాసులకు చాలా పవిత్రమైనవి. మొత్తం పూజలతో గడపడం అనవాయితీగా వస్తున్నది.

- పంద్ర జైవంత్‌రావు, ఎంపీపీ, ఉట్నూర్.

### నియమ, నిష్ఠలతో పూజలు చేస్తాం..



ఆదివాసులకు పవిత్రమైన మాసం పుష్యమాసం. ఈ మాసంలో ఏజెన్సీలోని చాలా జాతరలు జరుగుతాయి. గిరిజనులమైన మేము చాలా నిష్ఠతో పండుగలు, పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. మెస్రం వంశీయులు కుటుంబాలతో వచ్చి పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. ఒక్కో జాతర పదిరోజులపాటు కొనసాగుతాయి. బుడుందేవ్ జాతర పది రోజులు సాగనుంది. అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

- మరప బాజీరావు, గిరిజన నాయకుడు, సాలేవాడ(కే)

## బాసరలో భక్తుల సందడి

- అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రావణ్‌కుమార్

బాసర, ఫిబ్రవరి 18 : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. సెలవు దినం కావడం, పరీక్షలు దగ్గర పడుతుండడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి వచ్చారు. అమ్మవారి చెంత పెన్నులు, ప్యాడ్లను ఉంచి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. కాగా.. తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి శ్రావణ్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు శాలువాతో సత్కరించి.. అమ్మవారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్, ఏఈవో సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి లైన్‌లో నిల్చున్న భక్తులు

## నేడు డ్రామా పోటీలు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నేడు(సోమవారం) ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డ్రామా పోటీలను నిర్వహిస్తున్నామని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలు నిర్మల్ పట్టణంలోని అర్బన్ కేజీబీవీ పాఠశాలలో ఉంటాయని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా(నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్) పోటీలలో విజేతలుగా నిలిచిన వారు ఈనెల 26న రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు.

## బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఎదులాపురం, ఫిబ్రవరి 18 : ఆదిలాబాద్ డీఎస్పీగా జీవన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా హుజూరాబాద్ ఏసీపీగా పనిచేస్తున్న జీవన్‌రెడ్డిని ఆదిలాబాద్ డీఎస్పీగా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఉమేందర్‌ను రామగుండం ఏసీపీ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. అనంతరం వన్ టౌన్ సీఐ సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది జీవన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కాగా.. బదిలీపై వచ్చిన డీఎస్పీని సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు కూడా మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి మాధవ్, ఉపాధ్యక్షుడు రవీందర్, పరమేశ్వర్‌లు ఉన్నారు.

# కనుల పండువగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కూరలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన మహిళలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, ఫిబ్రవరి 18 : మండలంలోని కూర గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయాన్ని రంగు రంగుల పూలు, విద్యుద్దీపాలతో అలంకరించి, కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి-లక్ష్మీదేవి ప్రతిమలకు అభిషేకం చేసి, పట్టు వస్త్రాలతో అలంకరించి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల మహిళలు, భక్తులతోపాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీపీ గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతి, సర్పంచ్ అడ్డి తల వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మాజీ మంత్రి రామన్న పూజలు


కల్యాణోత్సవంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్, నాయకులు అశోక్ పాల్గొన్నారు.


# వాటర్ యాపిల్ ఆదాయంఫుల్

## మరో కొత్త పంటకు శ్రీకారం చుట్టిన కేంద్రే బాలాజీ

- నాలుగు మొక్కలు నాటిన రైతు
- ఒక్కోదానికి క్వింటాల్ వరకు దిగుబడి
- కిలోకు రూ.60 చొప్పున విక్రయం
- శ్రమ, పెట్టుబడి లేకుండా లాభాలు







ధనోరలో ఏపుగా పెరిగిన వాటర్ ఆపిల్ చెట్టు, విరగ్గాసిన పండ్లు

కెరమెరి, ఫిబ్రవరి 18 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం ధనోరా గ్రామానికి చెందిన రైతు కేంద్రే బాలాజీ మరో కొత్త రకమైన పంటకు శ్రీకారం చుట్టాడు. గతంలో యాపిల్ సాగు చేసి రాష్ట్ర ఉత్తమ రైతుగా అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకొని ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ప్రస్తుతం వాటర్ యాపిల్‌ను పరిచయం చేశాడు. 2015లో కేరళ నుంచి నాలుగు వాటర్ యాపిల్ మొక్కల(ఒక్కో మొక్కకు రూ. 120)ను కొనుగోలు చేసి తీసుకొచ్చి నాటాడు. ఎరువులు, క్రిమిసంహారక మందులేవీ వాడలేదు. నీళ్లు మాత్రమే పెట్టగా ఏపుగా పెరిగాయి. 2022లో పండ్లు కాయలు పడ్డాయి. యేటా ఫిబ్రవరి, ఏప్రిల్‌లో దిగుబడి వస్తుందని, ఒక్కో చెట్టుకు సుమారు క్వింటాల్ దాకా పండ్లు కాస్తాయని రైతు చెబుతున్నాడు. ఈ యేడాది ప్రస్తుతం పంట చేతికి వస్తున్నది. ఇప్పటి వరకు 50 కిలోల పండ్లు తెంపి, కిలో రూ.60 చొప్పున విక్రయిస్తున్నాడు. ఏమాత్రం శ్రమ.. పెట్టుబడి లేకుండా మంచి ఆదాయం పొందవచ్చని కేంద్రే బాలాజీ చెబుతున్నాడు.

## మహిళలు, చిన్నారుల రక్షణకే భరోసా కేంద్రాలు

- నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : నిర్మల్ జిల్లాలోని మహిళలు, చిన్నారుల సంక్షేమానికి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ అన్నారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన భరోసా కేంద్ర ప్రారంభోత్సవానికి సతీసమేతంగా హాజరై సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండా మహిళలు, చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని, పోక్సో కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు ఇవి దోహదం చేస్తాయని అన్నారు. జిల్లాలో భరోసా కేంద్రాల ఆవశ్యకత ఉందని అన్నారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా భరోసా కేంద్రాలకు వచ్చినట్లయితే పూర్తిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఏ చిన్న ఇబ్బంది వచ్చినా సహాయాన్ని పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి సతీమణి పద్మజ, భరోసా కేంద్ర ఇన్‌చార్జి, ఎస్సై సుమాంజలి, డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ పురుషోత్తం చారి, రూరల్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి కర్ణకుమార్

## నాగోబా హుండీ లెక్కింపు

- ఆదాయం రూ.19.83 లక్షలు





కానుకలను లెక్కిస్తున్న మెస్రం వంశీయులు, అధికారులు, హుండీలో వచ్చిన వెండి, బంగారం, డబ్బులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 18 : కేస్లాపూర్ నాగోబా జాతర హుండీలను ఆదివారం మెస్రం వంశీయులతోపాటు ఆలయ కమిటీ, రెవెన్యూ, దేవాదాయ, ఐటీడీఏ, పోలీసు శాఖలకు చెందిన అధికారుల ఆధ్వర్యంలో లెక్కించారు. జాతర ఆదాయం రూ.19,83,815 వచ్చాయని దేవాదాయశాఖ ఈవో రాజమౌళి తెలిపారు. హుండీలో నగదు రూ.8,62,015.. తైబజార్ ద్వారా రూ.11,21,800, వెండి 425 గ్రాములు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్, దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి భూమయ్య, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మాజీ సర్పంచ్ మెస్రం నాగ్‌నాథ్, మెస్రం వంశీయుల పెద్దలు బాజీరావ్ పటేల్, లింబారావ్ పటేల్, పర్ధాంజీ మెస్రం దాదారావ్, నాగోబా పేన్ కొత్వాల్ తిరుపతి, కటోడ కోసు, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్‌రావ్, మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం నాయకులు దేవ్‌రావ్, సోనేరావ్, కోసేరావ్, శేఖర్‌బాబు, మాణిక్‌రావ్, నాగోరావ్, నాగోబా ఆలయ పూజారి షేకు, నాగోబా ఆలయ కమిటీ మాజీమాజీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావ్, షేగ్‌నాథ్, చిత్రు, జంగుబాపు, దయాకర్, బద్రినాథ్ పాల్గొన్నారు.